నేడు రెండో విడత రైతు రుణమాఫీ

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 29 : రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకంలో భాగంగా మంగళవారం రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడతలో 1 లక్ష రూపాయల నుంచి 1.50 లక్షల రూపాయల వరకు రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 30వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పథకంలో 14 వేల 623 మంది రైతులు 153 కోట్ల 34 లక్షల 94 వేల 379 రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు.

పర్యావరణ ప్రేమికుడు సీఎండీ బలరాం

సీసీసీ నస్పూర్, జూలై 29 : సింగరేణి సీఎండీ బలరాం పర్యావరణ ప్రేమికుడని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. సింగరేణి సంస్థ సీఎండీ బలరాం జన్మదినం సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఎం పాల్గొని అధికారులు, కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఈఅండ్‌ఎం ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, ఆర్‌కే-5గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం చంద్రలింగం, ఇంజనీర్ మోహన్, ఫిట్ కార్యదర్శి సల్ల తిరుపతి, సూపర్‌వైజర్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

సీఎండీ బలరామ్ జన్మదిన వేడుకలు

శ్రీరాంపూర్, జూలై 29 : శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో సాయంత్రం సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఏరియా ఉపాధ్యక్షుడు నీలబోయిన కుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, లైజన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డీవైజీఎం రామడు, నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమా రెన్యూవల్ చేసుకోవాలి

కెరమెరి, జూలై 29 : పట్టాలు ఉన్న రైతులు రైతు బీమా రెన్యూవల్ చేసుకోవాలని ఏతవో వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని జోడేఘాట్, పాట్నాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతు బీమా ఈ నెల ఆగస్టుతో కాలపరిమితి పూర్తి కావస్తున్న నేపథ్యంలో ప్రతి యేడాది మాదిరిగానే రెన్యూవల్ చేసుకోవాలని ఆయన సూచించారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

మందమర్రి, జూలై 29 : రాష్ట్రంలో గుర్తించిన నూతన బొగ్గు గనులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ యాత్రలో భాగంగా సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఐదు గని పై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్ నిర్వహించారు. బెల్లంపల్లిలో ప్రారంభించిన సీపీఎం గనుల పరిరక్షణ బస్సు యాత్ర సాయంత్రం మార్కెట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనులను వేలం వేస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనులను వేలం వేసి సంస్థను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు. సింగరేణి ప్రైవేటు పరమైతే కొత్త ఉద్యోగాలు ఉండవని,

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైల ఆశయ్య

కార్మికులకు హక్కులు, భద్రత లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణిని ప్రైవేటీకరణ చేయమని చెబుతూనే పరోక్షంగా అందుకు మద్దతు తెలుపుతుందని ఆయన ఆరోపించారు. బొగ్గు గనుల వేలానికి సింగరేణి పరిరక్షణ కొరకే బస్సు యాత్రను చేపట్టడం జరిగిందని యాత్రలో అన్ని ఏరియాలలో తిరుగుతూ కార్మికులను, సింగరేణి ప్రాంత ప్రజలను చైతన్య వంతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి సంకె రవి, దూలం శ్రీనివాస్, దుంపల రంజిత్, జి.ప్రకాశ్, రాజేశ్వరి, ఏరియా నాయకులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

ఆసిఫాబాద్ టౌన్, జూలై 29 : పులుల సంరక్షణ తోనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఇక్కడ డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజరాణి, రాజేశ్వర చారి సెక్షన్ అధికారులు సాయి, లక్ష్మణ్ బీట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జైనూర్, జూలై 29 : మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌక్‌లో ఆటవీశాఖ అధికారులు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ మాట్లాడుతూ.. మూగజీవాలను కాపాడ వలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం సేవ్ నేషన్ సేవ్ టైగర్ నినాదాలతో మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో జ్ఞానేశ్వర్, జైనూర్ సిర్పూర్ లింగాపూర్ ఆటవిశాఖ అధికారులు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

సీఎంఫీఎప్ చీటీలు పంపిణీ

రెబ్బెన, జూలై 29 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో సోమవారం సింగరేణి కార్మికులకు సీఎంఫీఎప్ చీటీలు పంపిణీ చేసినట్లు డీవైపీఎం వేణు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, డీవైపీఎం వేణు, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఉన్నారు.

కొనసాగుతున్న నైపుణ్య శిక్షణ

కెరమెరి, జూలై 29 : మండలంలోని జోడేఘాట్ కుమ్రం భీం స్మారక మ్యూజియంలో ఆదివాసీ యువత కోసం ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ తరగతులు సోమవారం రెండవ రోజుకు చేరుకుంది. భారతీయ సాంఘిక సంస్థ ఆధ్వర్యంలో జోడేఘాట్ పరిసర ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ అందించారు. యువతను సామాజిక బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని నిర్వహకుడు అమల్‌రాజ్ తెలిపారు.

గోరింటాకు వేడుకలు

శ్రీరాంపూర్, జూలై 29 : శ్రీరాంపూర్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో సోమవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి, కార్యదర్శి కొట్టె జ్యోతిల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా సాంప్రదా య పద్ధతిలో గోరింటాకు నూరి మహిళలు ఒకరికి ఒకరు పెట్టుకొని సంబరాలు జరుపుకున్నారు.

మహిళ ల రక్షణ కోసమే షీటీంలు

రెబ్బెన, జూలై 29 : మహిళల రక్షణ కోసమే షీటీంలు పని చేస్తున్నాయని షీ టీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతు మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం లకు ఎవరైన గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు డబ్ల్యూహెచ్‌సీ సునీత, డబ్ల్యూపీసీ స్వప్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

శ్రీరాంపూర్, జూలై 29 : డిల్లీలో భారీ వర్షాల కారణంగా వరదల్లో మునిగి మృతి చెందిన శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గని మేనేజర్ విజర్‌కుమార్ కూతురు తాన్యాసోనీ మృతికి ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపా ధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి సం తాపం తెలిపారు. ఆమె మృతి పట్ల తాము సంతాపాన్ని, వారి కుటుంబ సబ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నా మని తెలిపారు.

సింగరేణి దవాఖాన మూసివేతకు కుట్ర

బెల్లంపల్లి, జూలై 29 : బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానను పూర్తిగా మూసివేసేందుకు సింగరేణి యాజమాన్యం కుట్రలు పన్నుతోందని సింగరేణి ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ నాయకులు ఆరోపించారు. సోమవారం ఆ కమిటీ నాయకులు దవాఖానను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గత 20 రోజుల నుంచి ఫార్మసీ స్టోర్, పురుష, మహిళా వార్డులను మూసివేసి ఉందని తెలిపారు. క్యాజువాల్టీ వార్డులో కేవలం 20 బెడ్లకు గాను కేవలం నలుగురు రోగులు మాత్రమే చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. దవాఖానకు చికిత్స కోసం వచ్చే రోగులను రామకృష్ణాపూర్,గోదావరి ఖని సింగరేణి ఏరియా దవాఖానలకు రెఫర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖానలో సరైన వైద్యులు, సిబ్బంది, నర్సులు, పారిశుధ్య కార్మికులు, ఆయాలు లేక కేవలం ఇద్దరు సిస్టర్లతో దవాఖానను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు చొరవతీసుకుని దవాఖానకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. లేని పక్షంలో తమ కమిటీ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు చేస్తామని, ఆమరణ నిరాహరదీక్షలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి దవాఖాన పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అదానీ, అంబానీలకు సింగరేణి తాకట్టు

బెల్లంపల్లి, జూలై 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి సంస్థను అదాని, అంబానీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర సోమవారం బెల్లంపల్లిలో ఆయన ప్రారంభించారు. అనంతరం కాంటా చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మరో వైపు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి సంస్థను ప్రయివేటీకరణ చేయమంటూనే బొగ్గు గనుల వేలం నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాని కంటే అధికంగా సింగరేణి సంస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం హక్కు ఉన్నా కేంద్రం పెత్తనం ఏంటని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం చేపట్టిన పోరుబాటను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి సింగరేణిని ప్రయివేటీకరించమని స్పష్టం చేసేవరకు ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సంకెరవి, అబ్బోజి రమణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేస్టేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు పనులు పరిశీలన

శ్రీరాంపూర్, జూలై 29 : నస్పూర్ సీసీసీలో వేస్టేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు నిర్మాణ పనులను సోమవారం సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్, పా) ఎన్‌వీకే శ్రీనివాస్ సందర్శించి పరి శీలించారు. నిర్మాణ పనుల వివిరాలు జీఎం సంజీవరెడ్డి, డీవై జీఎం ఆనంద్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆర్కే 8కాలనీ డిస్పెన్సరీని సందర్శించారు. డీవైసీఎంవోఏ డాక్టర్ రమేశ్ బాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్, ఇంచార్జి సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఈఈ గుండే రావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అందని ప్రోత్సాహం

శ్రీరాంపూర్, జూలై 29 : సింగరేణిలో కార్మిక క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందడం లేదని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరబద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సింగరేణిలో క్రీడా విభాగంలో యువ అధికారిని స్పోర్ట్స్ మేనేజర్‌గా నియమించినప్పటికీ క్రీడా విభాగం మెరుగు పడలేదని ఆరోపించారు. కేంద్ర సర్క్యూలర్ ప్రకారం క్రీడలు నిర్వహించడం పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి క్రీడా క్యాలెండర్ ప్రకారం క్రీడా పోటీలు నిర్వహించి కోలిండియా పోటీలకు పంపించాలన్నారు.

ధ్రువపత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జూలై 29 : శ్రీరాంపూర్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో సోమవారం పలు వృత్తి శిక్షణ పొందిన మహిళలకు జీఎం, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి ధ్రువపత్రాలు అందించి, అభినందించారు. శ్రీరాంపూర్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, డీవైజీఎం అరవిందరావు, పీఎం కాంతారావు, సేవ సమితి కార్యదర్శి కొట్టె జ్యోతి పాల్గొన్నారు.

కేకే ఓసీని సందర్శించిన డీసీపీ

మందమర్రి, జూలై 29 : సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సోమవారం సందర్శించారు. ఓసీలోని పని ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఓసీ సందర్శనకు వచ్చిన డీసీపీకి కార్యాలయంలో పూల మొక్కను అందించి మందమర్రి జీఎం ఏ.మనోహర్ స్వాగతం పలికారు. అనంతరం ఏరియా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డితో కలసి ఓసీని పరిశీలించారు.

బస్సు యాత్ర ప్రారంభం

కాసిపేట, జూలై 29 సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను సోమవారం బెల్లంపల్లిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించారు. అనంతరం సోమగూడెంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూలై 29 : ఓ వ్యక్తికి ఉద్యోగం పెట్టిస్తానని మోసం చేసిన కేసులో ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న మంచిర్యాలకు చెందిన బేర నగేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి విష్ణు ప్రసాద్ తనను పరిచయం చేసుకొని తనకు వరంగల్‌కు చెందిన దాసు హరికిషన్ బాగా తెలుసని అతనికి సింగరేణిలో పరిచయాలు వున్నాయని చెప్పి తన భార్యకు ఉద్యోగ అవకాశం కలిపిస్తానని మాయ మాటలు చెప్పి అతని వద్ద నుంచి రూ.15 లక్షలకు బేరం కుదుర్చుకొని హరికిషన్‌కు విష్ణు ద్వారా 2022లో రూ.5 లక్షలు ముట్టజేప్పినట్లు తెలిపారు. అనంతరం అనుమానము వచ్చి వారిని నీలదీయగా హరికిషన్ తప్పించుకొని పారిపోగా విష్ణు తనకు సంబంధం లేదని చెతులెత్తేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకొని వారి ఇరువురిపై క్రైమ్ నెంబర్ 455/24లో చీటింగ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీస్‌లు సోమవారం ఇరువురిని పట్టుకొని విచారించి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. దాస్ హరికిషన్ పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2నెలల క్రితం 8 చీటింగ్ కేసులు నమోదు అయ్యి జైలుకు వెళ్ళినట్లు విచారణలో తెలిందన్నారు.